క్లుప్తంగా

స్పందనకు మూడు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మూడు వినతులు అందాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రావాడ పంచాయతీలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఫలితంగా రావాడ, రేఖవానిపాలెం, గొల్లగుంట, కొత్త వెన్నలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఈఈ రామకృష్ణ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిన్నారుల ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: విజయనగరంలోని రామనారాయణం మందిరంలో పెందుర్తి ప్రాంతానికి చెందిన నాట్య కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గుమ్మడి దేవితేజోమయి, మొగ్గా దేవి జ్యోతిర్మయి, పీలా దేవి కిరణ్మయి, పీలా లక్ష్మి భరతనాట్యంలోని వివిధ రూపకాలతో అలరించారు. రామనారాయణ ట్రస్ట్ ప్రతినిధులు కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

విశేషంగా చంద్రమౌళీశ్వరుడికి పూజలు

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఉదయ్ కృష్ణ శర్మ, ద్వాదశి సోదరులు ఈ పూజలు నిర్వహించారు.

వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్‌మౌలా మృతికి సంతాపం



షేక్ మౌలా (ఫైల్)

పెందుర్తి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ షేక్‌మౌలా సోమవారం సాయంత్రం చినముషిడివాడలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలో ఆయన సేవలందించారు. మౌలా మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్‌ల్లో గంజాయి తరలిస్తున్న ముఠాను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 19 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరుకు చెందిన రఫీజ్ పాషా, పశ్చిమ గోదావరి జిల్లా కైకలూరుకు చెందిన షేక్ అబ్బాస్, ఇర్ఫాన్ ఖాన్‌లు అరకు నుంచి నగరానికి వస్తున్న ఆర్టీసీ బస్‌లో 11 కిలోల గంజాయి తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సరిపల్లి వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు. అదే సమయంలో డుంబ్రిగూడకు చెందిన పి.వెంకటరమణ, గుంటూరుకు చెందిన షేక్ నజీరుద్దీన్, ఎస్.పవన్‌కుమార్‌లు సరిపల్లి వద్ద తుప్పల్లోకి పరిగెడుతున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని పట్టుకోగా వారి వద్ద 8 కిలోల గంజాయి దొరికింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అట్టహాసంగా నాలుగో విడత ఆసరా విజయోత్సవ సభ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మహిళలు



వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అన్ని రంగాల్లో మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు.నాలుగో విడత వైఎస్సార్ ఆసరా విజయోత్సవ సభను పెందుర్తి ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగు విడతలు కలిపి నియోజకవర్గంలోని మహిళలకు రూ.184.54 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. దేశానికే రోల్ మోడల్‌గా రాష్ట్రంలో సంక్షేమం అమలవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ పనితీరును చూస్తున్న ప్రతిపక్షాలు రానున్న ఎన్నికల్లో తమ గెలుపు సాధ్యం కాదని కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నాయని విమర్శించారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఒక్క పథకమైనా సక్రమంగా అమలు చేశాడా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రతిపక్షాలు, పచ్చ మీడియా కుట్రలను ఛేదిస్తూ సీఎం వైఎస్ జగన్ వెంట అంతా ఉండాలని కోరారు. పెందుర్తి గ్రామీణం, జీవీఎంసీ పరిధిలోని 4827 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల్లోని 50,934 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్‌ను అందించారు. ముందుగా లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో ఏపీడీ శ్రీరాం, పెందుర్తి వెలుగు ఏపీఎం రమణ, కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, దాడి ఉమమహేష్, నరసింహం, పార్టీ సీనియర్ నేతలు మధుపాడ అంజి, కోన శ్రీనివాసరావు, నందవరపు అప్పలరాజు, గొంప అప్పారావు, కేసుబోయిన త్రినాథ్, వినోద్, సంపత్‌వర్మ, వీవోఏలు, ఆర్పీలు, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా విజయోత్సవ సభకు హాజరైన మహిళలు

అంధత్వ నిర్మూలనకు కృషి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

పెందుర్తి: రానున్న రోజుల్లో శంకర్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్ అన్నారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో సోమవారం ఆప్తమాలజీలో వచ్చిన క్లినికల్ మార్పులపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌ఫౌండేషన్‌లో ఆధునిక పరిజ్ఞానంతో అత్యాధునిక వైద్యం అందిస్తున్నామన్నారు. పలు కీలక అంశాలపై చర్చించారు. జీఎంపీ రాధాకృష్ణన్, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సువర్ణ, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ జి.వి రమణకుమార్, డాక్టర్ సుకుమార్, డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డీజీఎం రమేష్‌కుమార్, డీజీఎం పీఆర్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్స్‌లో సాయమందించండి

కేజీహెచ్ ఆర్థో సర్జన్ డాక్టర్ రాజ్ కమల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్ కమల్

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించేందుకు సహకరించాలని కేజీహెచ్ ఎముకల వైద్యనిపుణుడు డాక్టర్ వి. రాజ్ కమల్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియామాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. అలా స్పందించిన వారు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. గుడ్ సమారిటన్ గైడ్‌లైన్స్‌ను అందరూ పాటించాలని కోరారు. ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహన చోదకులు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల జరిగిన 10 ప్రమాదాల్లో 7 మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో వేణుగోపాల్, సహాయ మోటార్ వాహన తనిఖీ దారులు శ్రీనివాస యాదవ్, ఏవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చ.. పరిష్కారానికి సూచనలు

అర్థవంతంగా సాగిన మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఫలప్రదంగా సాగింది. పలు సమస్యలపై చర్చించడంతో పాటు పలు శాఖల అధికారుల తీరును సభ్యులు ఎండగట్టారు.సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. మొత్తానికి సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని ప్రజాప్రతినిదులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ సూర్యకుమారి స్పందిస్తూ ఇకపై పొరపాట్లు జరగకుండా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని.. సమగ్ర రీ సర్వేలో గుర్తించిన లోపాలను సరి చేయాలని సూచించారు.

సభ్యులు ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు

పైడివాడ అగ్రహారంలో విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేస్తున్నారని సర్పంచ్ వడ్డాది అప్పలరాజు అసహనం వ్యక్తం చేశారు.

- సమగ్ర రీ సర్వేలో కమతాల విస్తీర్ణం తప్పుగా నమోదవడంతో పలువురు రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు కో ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు ప్రస్తావించారు. స్పందించిన తహసీల్దార్ సత్యనారాయణ వాటిని సరి చేస్తామని తెలియజేశారు.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది పని తీరు బాగోలేదని ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆరోపించారు. నల్లరేగలపాలెంలో వృద్ధురాలు ఇటీవల మరణిస్తే ఆమెకు ఐదుగురు సంతానం కాగా అందులో కొంతమంది రిజిస్ట్రేషన్ పెట్టుకుంటే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదని నెల రోజుల పాటు పెండింగ్ పెట్టారన్నారు. తర్వాత అదే ఫైల్ లంచం తీసుకుని పూర్తి చేశారని ఆమె ఆరోపించారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో అలాంటిది జరగలేదని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.
- గ్రామాల్లో సీసీ రోడ్లు,డ్రైన్‌లు, బీటీ రోడ్లు వంటి వాటికి అవసరమైన మేరకు గ్రావెల్ తరలించానికి అధికారులు అనుమతులు ఇవ్వాలని పలువురు కోరారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీ రాణి,ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో షేక్ బాబూరావు,ఈవోఆర్డీ మహేష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులు

97వ వార్డులో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: సంక్షేమం..అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. దాదాపు రూ.2.30 కోట్లతో జీవీఎంసీ 97వ వార్డులో గోపాలకృష్ణనగర్, కార్మికనగర్, సుజాతనగర్–ఎ జోన్, సప్తగిరినగర్, పీఎఫ్ కాలనీ, చినముషిడివాడ పాతూరు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి సాదించామన్నారు.

జీవీఎంసీ ప్రాంతంలోని ప్రతీ కాలనీ అభివృద్ధి పథంలో నిలవాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పం అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్, నాయకులు కిల్లి అప్పారావు, మెంటి సూరిబాబు, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజేతలకు బహుమతుల ప్రదానం



ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందుంటుకున్న కృష్ణానగర్ జట్టు



విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న పినగాడి మహిళా కబడ్డీ జట్టు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నియోజకవర్గ స్థాయి విజేతలకు సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

- క్రికెట్: పురుషులు: విజేత వేపగుంట సమీపంలోని కృష్ణానగర్–1, ద్వితీయస్థానం తానాం–1, మూడోస్థానం వాలిమెరక .
- మహిళా విభాగం: విజేత..ఆరిపాక, ద్వితీయస్థానం సుజాతనగర్–1, తృతీయస్థానం గుర్రంపాలెం.
- బ్యాడ్మింటన్. పురుషుల విజేత సబ్బవరం మండలం గుళ్లేపల్లి, ద్వితీయస్థానం. తానాం–1, మూడోస్థానం. పాపయ్యరాజుపాలెం–3.
- మహిళా విభాగం విజేత: సింహపురికాలనీ, ద్వితీయస్థానం రాంపురం, మూడోస్థానం కె.ఎస్.పాలెం.
- వాలీబాల్ పురుషుల విజేత: నమ్మిదొడ్డి, ద్వితీయ స్థానం ముత్యమాంబకాలనీ, మూడోస్థానం ముత్యాలమ్మపాలెం.
- మహిళా విభాగం విజేత తానాం–1, ద్వితీయస్థానం చీమలాపల్లి, తృతీయస్థానం సరిపల్లి.
- కబడ్డీ: పురుషుల విజేత మంత్రిపాలెం, ద్వితీయస్థానం పెదముషిడివాడ, తృతీయస్థానం పాపయ్యరాజుపాలెం.
- మహిళా విభాగంవిజేత పినగాడి, ద్వితీయస్థానం తానాం–1, మూడోస్థానం పైడివాడ అగ్రహారం.
- ఖోఖో పురుషుల విజేత లంకెలపాలెం, ద్వితీయ స్థానం నాయుడుపాలెం, తృతీయస్థానం తవ్వవానిపాలెం.
- మహిళా విభాగం విజేత లంకెలపాలెం, ద్వితీయ స్థానం పినగాడి, తృతీయస్థానం తానాం–1.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు ఘన సత్కారం



ఎంపీడీవో రమేష్ నాయుడును సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: ఎన్నికల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడును సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారితో పాటు ఎంపీటీసీలు ,మండల స్థాయి అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ సూర్యకుమారి,తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ 8 సార్లు ఉత్తమ సేవా పురస్కారాలు, రెండు జాతీయ స్థాయి అవార్డులు రమేష్ నాయుడు అందుకున్నారని అభినందించారు. ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ సబ్బవరం మండలంలో పనిచేయడం తన కుటుంబ సభ్యులతో కలిసి పనిచేసిన అనుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, పాలిశెట్టి సురేష్ రాజ్, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

పినగాడి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి



ఏడీసీకి వినతిపత్రం అందిస్తున్న ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని వేపగుంట–పినగాడి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. ఈ మేరకు సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వై. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. దేముడు మాట్లాడుతూ రోడ్డుపై గోతులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆర్ అండ్ బీ నిధులు కేటాయించిందని, పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. మరమ్మతుల బాధ్యత జీవీఎంసీ తీసుకోవాలని కోరారు.

లారీ, బైక్ ఢీ-యువకుడి మృతి

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని సంతోషిమాత గుడి ఎదురుగా సోమవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం దొగ్గవానిపాలెం గ్రామానికి చెందిన దమ్ము అప్పలరాజు(35) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఎస్.కోట బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అరకు–విశాఖ రోడ్డులో సంతోషిమాత గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడితీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, హాసిని (12), హసిత్ బాబు పిల్లలున్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కూర్మన్నపాలెం: భర్త, అత్తమామల వేధింపులు తాళ్లలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెం లోని అంబేడ్కర్‌కాలనీ రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కన పార్వతీపురానికి చెందిన సైలాడ పాండురంగారావు.. తన భార్య ప్రమీల (31), ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. వీరికి 2012లో వివాహంకాగా, 11 ఏళ్ల బాబు నితీష్‌కుమార్, 4 ఏళ్ల పాప నిహారిక ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు పాండురంగారావు మావయ్య పువ్వల శంరరావుకు ఫోన్ చేసి ప్రమీల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో పార్వతీపురం నుంచి శంరరావు దంపతులు కేజీహెచ్‌కు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకోవడంపై అల్లుడు పాండురంగారావు, ఆయన తల్లిదండ్రులే కారణమని దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు



వాడచీపురుపల్లిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న గ్రామ సింహాలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్లు, ముఖ్యకూడళ్లు, మాంసం, చేపల దుకాణాల వద్ద గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. చీకటి పడితే చాలు రోడ్లను ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. విధులకు వెళ్లి అర్ధరాత్రి అపరాత్రి సమయంలో ఇళ్లకు వస్తున్న వారిపై రోడ్ల మీద నిద్రిస్తున్న వీధి కుక్కలు దాడులకు పాల్పడుతూ గాయాలపాల్జేస్తున్నాయి. బజార్లకు వెళ్లే మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, రావాడ, వెన్నలపాలెం, కలపాక, పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, పరవాడ, భర్నికం, తానాం, సాలాపువానిపాలెం, తాడి పెదముషిడివాడ, మంత్రిపాలెం, మడకపాలెం తదితర ప్రాంతాల్లో గ్రామ సింహాల బెడద అధికంగా ఉంది. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

4న విప్రోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణ, సుబ్బారావు, వ్యాసశర్మ

అగనంపూడి: బ్రాహ్మణుల వెనుకబాటుతనంపై చర్చించేందుకు వచ్చేనెల 4వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బ్రాహ్మణ సంఘాల నేతృత్వంలో గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న విప్రోత్సవం విజయవంతం చేయాలని అగనంపూడి శారదా గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ధర్మాల సుబ్బారావు, జి.పూర్ణానందశర్మ (పూర్ణ), ధర్మాల వ్యాసశర్మ కోరారు. అగనంపూడిలోని పూర్ణ కార్యాలయంలో 85వ వార్డు శారదా గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో బ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక వెనుకబాటుతనంపై చర్చిస్తారన్నారు. విప్రోత్సవం అనంతరం బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కె.చరణ్, కె.వి.రామభద్రుడు, చిన్న శ్రీను, బి.వెంకట సత్యరామకృష్ణ, చింతా రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1082వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రాణత్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.